# కథ మలుపు తిరిగింది

భార్య పంకజం అడిగిన కోరిక విని సదరు భర్త గోపాలం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. అంతెత్తున అదిరిపడ్డాడు.

"ఏదీ మళ్ళీ ఒకసారి చెప్పు" అనడిగాడు తనకి వేరేలా వినపడిందేమోనని సంశయిస్తూ.

"థమ్సప్‌లో కాఫీ కలుపుకుని తాగాలని వుందండీ!" చెప్పింది పంకజం గారాలు పోతూ.

గోపాలం వెర్రిచూపులు చూసాడు. ఎమోషనల్‌గా వుండాలని కాసేపు పిచ్చిపిచ్చిగా కూడా చూశాడు.

భర్త ఫీలింగ్స్‌ని ఏమాత్రం పట్టించుకోకుండా అతను చెప్పబోయే సమాధానం కోసం ఆత్రంగా ఎదురుచూస్తోందామె.

"థమ్సప్‌లో కాఫీనా? బుద్ధున్న వాళ్ళుచేసేపనేనా ఇది" ఘెల్లుమన్నాడు భార్యకి వినపడకుండా పెదాలు మాత్రం కదిలిస్తూ.

పంకజం మాత్రం ఇంత మంచి ఆలోచన ఇన్నాళ్ళనుండీ తనకెందుకు తట్టలేదాని తెగ వాపోతోంది. ఆ టేస్ట్ ఎలా వుంటుందాని తెగ ఆరాటపడిపోతోంది.

అలా రకరకాల వింత కాంబినేషన్స్ టేస్ట్ చూడ్డం ఆమెకు అలవాటు. అలవాటు అనేకంటే అదోరకమైన మానసిక రుగ్మత అని సరిపెట్టుకోవడం రివాజైపోయిందతినికి.

"చెప్పరేం?" అడిగింది పంకజం.

"టాట్ వీల్లేదు" గర్జించాడు.

"అంతలా అరవక్కర్లేదు. నాకేం చెవుడు కాదు" మూతి ముడిచింది.

"వీల్లేదంటే...థమ్సప్‌లో కాఫీ వీల్లేదన్నాను. కానీ కాఫీలో థమ్సప్ కలుపుకుంటే వద్దననుగా" అంటూ అగ్రీ అయ్యాడు నవ్వుతూ ఏడ్వలేక, ఏడుస్తూ నవ్వలేక.

లేకపోతే ఎటొచ్చి ఏం జరుగుతుందో ఊహించడం కష్టం కనుక.

"అబ్బ! మీరెంత మంచివారండీ!" అంటూ గట్టిగా, ఊపిరాడకుండా వాటేసుకుని చెంపమీద దీర్ఘంగా ఓ ముద్దిచ్చి వదిలేసింది.

ముద్దూ ముచ్చట్లని స్వీకరించే స్థితిలో లేని గోపాలం ఉసూరుమంటూ సోఫాలో చతికిలపడ్డాడు.

ఆమె కాఫీకోసమని వంటింట్లోకి పరుగెత్తింది.

గోపాలం తలెత్తి పైకి చూశాడు. గిరగిరా తిరుగుతోన్న ఫ్యాను కన్పించింది.

అంతే.

గిర్రున ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళ్ళిపోయాడు.

* * *

పెళ్ళయిన కొత్తలో అన్నమాట.

మొదటి రోజు, అంటే శోభనం రోజు.

ఇద్దర్నీ గదిలోకి తోసి అమ్మలక్కలు ధడేల్మని తలుపులు బిగించి పెట్టేసాక... ప్రేమగా భార్యని దగ్గరకు తీసుకొని గోపాలం ఓ స్వీటుముక్క ఆమెనోటికి అందించబోయాడు.

"ఆగండాగండి" అందామె వారిస్తూ.

చప్పున ఆగిపోయాడు.

స్వీటు ముక్కని తిరగేసి, మర్లేసి అటు తిప్పి, ఇటుతిప్పి చూసాడు. బానే వుందిగా అనుకుంటూ-

"ఫ్రెష్ స్వీట్. పుల్లారెడ్డి షాప్‌నుంచి తెప్పించినవే!" అన్నాడు ఆమె ఎందుకు వద్దందో అర్థమవ్వక.

"హబ్బే! స్వీటుగురించి డౌటు కాదు" అందామె.

"మరి?"

"షుగర్ లేదా మీ ఇంట్లో" అనడిగింది.

"వాటే జోక్? ఇంట్లో షుగరుండదా?"

తెగ ఆశ్చర్యపోయాడు.

"అయినా ఇప్పుడు షుగరెందుకు?" అర్థం కాలేదతనికి.

"షుగర్‌లో స్వీటు అద్దుకుని తినాలని ఎప్పట్నుంచో కోరిగ్గా వుంది. అందుకే..."

భార్య మాటలు వింటూంటే మెంటలెక్కుతోంది గోపాలానికి. ఆమె వింత విపరీత

టేస్టుకి గుండు సూదితో గుండెలో గుచ్చినట్టవుతోంది. అయినా ఏమి చేయలేని సంకట స్థితి. సర్దుకుపోతున్నాడంతే. తనకు సమయం రాకపోతుందా అని.

అదీ ఫ్లాష్‌బ్యాక్!

అది మొదలు ఇప్పటివరకూ ఇలా ఎన్నోరకరకాల టేస్ట్‌లు చూస్తానంటూ గోపాలాన్ని వేధిస్తోంది. సహిస్తున్నాడు ఓపిగ్గా.

ఇలాగే మరోసారేమయ్యిందంటే-

ఆఫీసునుండి వస్తోన్న భర్తకి ఎదురెళ్ళి మరీ "మీకో దుర్వార్తండీ!" అంది బాధలేకుండా చర్నవ్వుని ఎంచక్కా మిక్స్ చేస్తూ.

ఎస్టేట్‌లో పనిచేసే పిల్లని ప్రేమిస్తున్నానని చెప్పిన హీరో మాటవిని గుండెపోటొచ్చిన క్యారెక్టర్ యాక్టర్‌లా ఆమె మాటలకి, పొంతనలేని ముఖ కవళికలను చూసి గోపాలం గింజుకున్నాడు.

'ఎవరైనా టపీమన్లేదు కదా?' అని లోలోపల గుండెలదురుతుంటే "ఏంటే? ఏం జరిగింది?" అందోళనగా అడిగాడు.

పరుగుపరుగున వెళ్ళి వంటింట్లోంచి తెచ్చిన పకోడి ప్లేట్‌ని చేతికందిస్తూ "ముందో పకోడి ముక్క నోట్లో వేసుకోండి" అంది.

"దుర్వార్తంటావ్... పకోడి తినమంటావ్! టెన్షన్‌తో చంపక విషయం చెప్పేద్వావే" హై పిచ్‌లో విసుక్కున్నాడతను.

"వన్‌డే కప్‌లో ఇండియా పరాజయం పాలయ్యిందండీ!" నెమ్మదిగా రిజల్ట్ ఔట్ చేసింది.

"నిన్ను తగలెయ్య! అంతదానికే ఇంత వర్రీ పెట్టాలా. హడలి చచ్చాననుకో. అయినా విడ్డూరం కాకపోతే ఓడిపోతే పకోడి తినడమేంటే?" నిలదీశాడు భార్యను.

"గెలిస్తే స్వీట్ పంచుతారు. మరి ఓడిపోయారుగా! అందుకని ఖారా పంచుతున్నానన్న మాట" అందామె గలగలా కాదు గరగరా నవ్వుతూ.

కళ్ళు గిర్రున తిరిగాయ్ గోపాలానికి.

* * *

అలాగుంటాయి ఆవిడగారి అభిరుచులు ప్లస్ ఆలోచన్లు. వేగలేక ఛస్తున్నాడు గోపాలం.

ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి. ఆమెని వారించలేని అశక్తత.

ఒకరోజిలాగే తలారా స్నానం చేసి వచ్చిన గోపాలంతో "ఏవండీ! ఈ రోజు పండగ కదండీ! ధోవతీ కట్టుకోండి" అంది పంకజం అభిమానంగా.

"పండగయితే ధోవతీ కట్టుకోవడం దేనికి?" విస్తుపోతూ అడిగాడు.

"సంప్రదాయబద్ధంగా వుంటుంది. పండుగ వాతావరణంలా చూడముచ్చటగా వుంటుంది" అందామె మురిపెంగా.

"ధోవతేగా సర్సర్లే కడతాలే. పెళ్ళినాటి ధోవతి, లాల్చి ఎలాగు ఉన్నాయిగా! పట్రా." అన్నాడు గోపాలం.

"ధోవతి సరే! లాల్చీ ఎందుకు?" ఈసారి ఆశ్చర్యపోవడం పంకజం వంతయ్యింది.

"లాల్చీ ఎందుకా?" భార్యవంక భయం భయంగా చూస్తూ" ధోవతీ మీద లాల్చీకాక మరేంటి కడతారు" అనడిగాడు వ్యంగ్యంగా.

బిగ్గరగా నవ్వింది.

"అది కామన్ కదండీ! అందులో థ్రిల్లింగ్ ఏముంటుంది?" అంది నవ్వాపి.

అనుమానంగానూ, విచిత్రంగానూ చూసాడు భార్యవంక.

"ధోవతీ మీద టీషర్ట్ వేయండి. వెరయిటీగా వుంటుంది" అంది.

అది విని గోపాలం తారెత్తిపోయాడు. నెత్తీ నోరు కొట్టుకున్నాడు.

నరాల్నెవరో పరపరా మొండికత్తితో కోసినట్లై హిస్టీరియా వచ్చిన పేషెంట్‌లా ఊగిపోయాడు కాసేపు.

* * *

భార్యకి పట్టుకున్న ఈ పిచ్చి ధోరణి ఎలా పోగొట్టాలో ఒక పట్టాన అర్థంకాలేదు గోపాలానికి.

స్టార్ హీరో సినిమా కోసం కథ ఆలోచించే రైటర్‌లా తెగ చించాడు మెదడుని.

ఎలాంటి అయిడియా తట్టలేదతని ప్లాస్టిక్ బుర్రకి.

"ఏవండీ! ఒక చిన్న కోరిక" అంటూ వచ్చి భర్త పక్కన చేరింది.

"ఏంటో చెప్పేడువ్!" అన్నాడు చిరాగ్గా.

వెంటనే చెప్పలేదు పంకజం. ఊరిస్తున్నట్లుగా ఆగిందొక్క క్షణం.

పేలబోతున్న అణుబాంబులా మారింది గోపాలం పరిస్థితి గుండెలు దడదడలాడసాగేయి.

మళ్ళీ ఎలాంటి విపరీత కోరిక అడగబోతోందో కదా అని శూన్యంగా చూపులు సారించాడు శ్రీమతి వంక.

"మన పెళ్ళి నాటి వీడియో క్యాసెట్ వుంది చూడండి"

"కొత్తగా ఇప్పుడు చూడ్డమేంటి? ఎప్పుడో చూసాం గదా!"

"అయ్యో! అదికాదు"

"ఆ... అయితే చెప్పు ఏంటీ?" అన్నాడు హీన స్వరంతో.

"మన పెళ్ళి వీడియో క్యాసెట్‌కి, ఇంగ్లీషు ఆడియో మిక్స్ చేస్తే ఎలా వుంటుందా అని" అంది హుషారుగా.

గోపాలంలో ఊపిరి స్తంభించింది.

మనో వికారాదులు అతన్ని అల్లకల్లోలం చేసాయి. మిక్సీలో పడ్డ ఇడ్లీరవ్వలా అయిపోయాడు కాసేపు.

అలా కొద్ది క్షణాలు గడిచాయి.

ఎప్పట్లా ఆత్రంగాఎదురు చూస్తోంది పంకజం భర్త ఏం చెబుతాడా అని.

గోపాలం షాక్‌నుండి నెమ్మదిగా కోలుకుని, తేరుకొని-

"ఓస్ ఇంతేకదా! అలాగే చేయిస్తాలే" అంటూ భార్యకి గట్టిగా వాగ్దానం చేశాడు.

పంకజం ముఖం వికసించింది.

గోపాలం పెదవి విప్పాడు. అతని చూపులు అదోలా వున్నాయి.

ఈసారి పంకజం బెరుగ్గా చూసింది. భర్తలో ఏదో కొత్త మార్పుని సరికొత్తగా గమనిస్తోంది.

చెబుతున్నాడు గోపాలం ఇలా..

"నాకూ నీలాగే డిఫరెంట్ కాంబినేషన్ల ఆలోచన్లు వస్తున్నాయి. ముందు బీరువాలో వున్న నీ పట్టుచీరలన్నీ ఇలా పట్రా" అన్నాడు.

"నా...నా...పట్టుచీరలా! ఎందుకు?" విస్మయంగా అడిగింది.

"చీరలన్నింటినీ పీసెస్‌గా చేయించి, నాలుగు రకాల చీరల ముక్కల్ని కలిపి ఒక్క చీరగా కుట్టిస్తే ఎలా ఉంటుందా అని?" అంటూ భార్యామణివైపు చూశాడు ఎలా వుంది ఐడియా అన్న ఫీలింగ్‌తో.

పంకజం ముఖంలో నెత్తురు చుక్కలేదు.

భర్త ప్రపోజల్ విని నీళ్ళు నమలసాగింది.

* * *

అలా కథ మలుపు తిరిగింది!

ఎలాగైతేనేం పంకజానికి బ్రేక్ పడింది.

ఇప్పుడు గోపాలం హేపీ!

ఆంధ్రభూమి వార పత్రిక నిర్వహించిన హాస్య కథల
పోటీలో ఎంపికైన కథ

(03.10.2002)